ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 4 నవంబరు 2025

పెద్దపల్లిలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం

● నోడల్ అధికారిగా డాక్టర్ ఓదెల సంపత్

పెద్దపల్లి, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా రైతులకు మరిన్ని సేవలను అందించేందుకు పెద్దపల్లిలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు నోడల్ అధికారిగా డాక్టర్ ఓదెల సంపత్‌ను నియమించారు. తెలంగాణలోని రైతులకు వ్యవసాయ వర్సిటీ ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలు, వివిధ పంటలకు సంబంధించి నాణ్యమైన విత్తనాలు, అధునాతన శాస్త్ర సాంకేతికను అందుబాటులోకి తీసుకు వస్తున్నది. వర్సిటీ శాస్త్రవేత్తలను రైతాంగానికి చేరువ కావడానికి వ్యవసాయ వర్సిటీ తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రాల ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మొదటి దఫాగా 15 జిల్లాలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. నోడల్ అధికారి మాట్లాడుతూ జిల్లా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రైతు విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే విజయ రమణా రావు, కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో బి గంగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.



యాసంగికి బేఫికర్..

- నిండుగా ఎస్సారెస్పీ, శ్రీపాద ఎల్లంపల్లి
- ప్రాజెక్టులకు ఇంకా కొనసాగుతున్న వరద
- దిగువకు 1200 టీఎంసీలకు పైగా వరద నీరు
- పూర్తి స్థాయి పంటలకు అందనున్న సాగు నీరు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాకు వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టుతోపాటు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నాయి. పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతోపాటు రెండున్నర మాసాలుగా ప్రాజెక్టుల నుంచి దిగువకు వరద నీరు కొనసాగుతూనే ఉన్నది. రికార్డు స్థాయిలో ఈ రెండు ప్రాజెక్టుల నుంచి ఈ సీజన్‌లో 1200 టీఎంసీల నీటిని గోదావరిలోకి వదిలిపెట్టడం గమనార్హం. వచ్చే యాసంగి సీజన్‌కు జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలతో పాటు సూర్యాపేట జిల్లా వరకు కూడా సాగు నీటిని సరఫరా చేయనున్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టులో యేటా ఇసుక మేటలు వేస్తుండడంతో నిల్వలు తగ్గుముఖం పడుతున్నాయి. 110 టీఎంసీ ప్రాజెక్టు ప్రస్తుతం 80.5 టీ ఎంసీల నీటి మట్టానికే కుదించుకు పోయింది. ప్రస్తుతం పూర్తి స్థాయి నీటిమట్టం ఉండగా, ఎగువ ప్రాంతం నుంచి 56,513 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, దిగువకు 16 గేట్ల ద్వారా 47,059 క్యూ సెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. అలాగే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం అంతే మొత్తంలో నీరు ఉండగా, ఎగువ ప్రాంతం నుంచి 1,15,992 క్యూసె క్కుల వరద నీరు వస్తున్నది. అంతే మొత్తంలో 11 గేట్ల ద్వారా దిగువకు నీటిని వదిలి పెడుతున్నారు. జిల్లాలో 2 లక్షల 80 ఎకరాల సాగు భూములు ఉం డగా, వానాకాలం సీజన్‌లో వర్షాలు అను కూలిస్తే మొత్తం సాగవుతున్నాయి. యాసంగిలో పత్తి పంట పోనూ నీటి లభ్యతను బట్టి 2 లక్షల 22 వేల ఎక రాల వరకు భూములు సాగవుతున్నాయి. ఈసారి ఎస్సారెస్పీతోపాటు శ్రీపాద ఎల్లంపల్లి, మిడ్ మానేర్, లోయర్ మానేరు డ్యామ్‌లో కూడా పూర్తిస్థాయి నీళ్ల ఉన్నాయి. జిల్లాలో ఎస్సారెస్పీ

ప్రాజెక్టు	పూర్తి స్థాయి నీటి మట్టం (టీఎంసీలు)	ప్రస్తుతం (టీఎంసీలు)	వస్తున్న వరద (క్యూసెక్కులు)	దిగువకు (క్యూసెక్కులు)
1. ఎస్సారెస్పీ	80.5	80.5	56,513	47,059
2. శ్రీపాద ఎల్లంపల్లి	20.175	20.175	1,15,992	1,15,992

(మిగతా 8వ పేజీలో)

వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని కొండా లక్ష్మణ్ ఉద్యానవన శాఖ విశ్వవిద్యాలయం ఉపకులపతి దండ రాజిరెడ్డి అన్నారు. కూనారంలో సోమవారం కృషి విజ్ఞాన కేంద్రం రామగిరి ఖిల్లా, వ్యవసాయ అనుబంధ శాఖల సహకారంతో రైతు సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో కోటి 20 లక్షల విస్తీర్ణంలో వరి పండిస్తున్నారని, వరికి కిలోకు 300 లీటర్ల నీటి అవసరం ఉంటుందన్నారు. రాష్ట్రంలో 50 లక్షల ఎకరాల్లో వరి పండిస్తే సరిపోతుందన్నారు. కూరగాయలు, కందులు, గోధుమలు, నువ్వులు, మక్కలు, శనిగలు, ఇతరత్రా పంటలు వేయాలని రైతులకు సూచించారు. ఐదు పంటలు పండించవచ్చని, కానీ రైతులు వరి, పత్తి రెండు పంటలు మాత్రమే సాగు చేస్తున్నారన్నారు. అధికంగా పురుగు మందులు వాడితే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. బయో ఫెర్టిలైజర్ మందులను విరివిగా ఉపయోగించాలని సూచించారు. గతంలో కూరగాయలు, పెసలు, కందులు పండించిన మన రాష్ట్రం ప్రస్తుతం రాజస్థాన్ నుంచి దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కూరగాయల సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. తాను కూనారం జన్మించి వ్యవసాయం చేస్తూ చదువుకున్నానని, చిన్న తనంలో 1965లో పంటలు సరిగా పండకపోవడం వల్ల హరితవిప్లవం వచ్చిందన్నారు. ఎమ్మెల్యే చింత కుంట విజయరమణరావుతో కలిసి కోరమండల్ ఇంటర్నేషనల్ వారి ఆర్థిక సహాయంతో గ్రామపంచాయతీ కార్యాలయంలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. కోరమండల్ వైస్ చైర్మన్ జీవీ సుబ్బారెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, మాజీ సర్పంచ్ డొంకన మొగిలి, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ ఉపకులపతి దండ రాజిరెడ్డి

గోదావరి నదిలో
యువకుడి గల్లంతు
రెస్క్యూ ఆపరేషన్, లభ్యం కాని ఆచూకీ
ఆరా తీసిన మంత్రి శ్రీధర్‌బాబు, పుట్ట మధు
6

తెలంగాణలో మరో 6 నెలల పాటు
కాల్పుల విరమణ
రాష్ట్రంలో శాంతికి భంగం కలిగించేందుకు బీజేపీ కుట్ర
మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్
6

ధాన్యం బోనస్ డబ్బులు చెల్లిస్తాం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : త్వరలోనే యాసంగి,వానాకాలం సన్న రకాలకు బోనస్ డబ్బులు చెల్లిస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సోమవారం కొలనూర్, గోపరపల్లిలో వ్యవసాయ సహకార సంఘం, ఐకేపి ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ధాన్యాన్ని శుద్ధిచేసి, తేమశాతం తగ్గిన తరువాత కేంద్రాలకు తీసుకురావాలని రైతులను కోరారు. తడిసిన ధాన్యాన్ని మిల్లులకు పంపించ వద్దని తెలిపారు. కేంద్రంలో నిర్వాహకులు తప్పిదాలకు పాల్పడితే చర్యలు ఉంటాయన్నారు. రైతులు నిర్వాహకులకు సహకరించాలన్నారు. అనంతరం ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దమ్మ వేడుకలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరిసేటి రాహుల్, ఆలయ చైర్మన్ చీకట్ల ముండయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ గోపు నారాయణరెడ్డి, సీఈవో గోలి అంజిరెడ్డి, మాజీ సర్పంచులు బొంగోని రాజయ్య, సామ శంకర్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బైరి రవీందర్‌గౌడ్, గుండేటి మధు యాదవ్, ఆకుల మహేందర్, చొప్పరి రాజయ్య, కుంచం మల్లయ్య పాల్గొన్నారు

జిల్లాలో 48 వేల ఎకరాల్లో పత్తి సాగు

● ఐదున్నర లక్షల క్వింటాళ్ల దిగుబడి అంచనా ● జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రవీణ్ రెడ్డి

సుల్తానాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 48వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారని, తద్వారా 5.5 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందనే అంచనా వేసినట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. చిన్నకల్వలలోని శ్రీవెంకటేశ్వర జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అం తటి అన్నయ్యగౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావుతో కలిసి సోమవారం ప్రారంభించారు. జిల్లాలో నాలుగు జిన్నింగ్ మిల్లులు ఉన్నాయని తెలిపారు. రాఘవాపూర్, నిట్టూరు నిమ్మనపల్లి, కమాన్‌పూర్ మండలం గొల్లపల్లిలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నిబంధనల మేరకు సెంట ర్లకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. తేమ 8 శాతం ఉన్న పంటకు కేంద్ర ప్రభుత్వం రూ.8111 క్వింటాల్‌కు ప్రకటించిందన్నారు. కాపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకొని పట్టా దారు పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ తీసుకురావాల న్నారు. మాజీ ఎంపీటీసీ పన్నాల రాములు, జైపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బక్కయ్య, లక్ష్మినారాయణ, తిరు పతి, రమేష్, మనోహర్, సీసీఐ అధికారి భరత్, మండల వ్యవసాయ అధికారి పైడితల్లి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.


పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి

ఏఐ ద్వారా విద్యా ప్రమాణాలు పెంపొందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏఐ ల్యాబ్ ద్వారా విద్యా ప్రమాణాలు పెంపొందించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం రంగాపూర్‌లోని జిల్లా పరిషత్, ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో 3 నుంచి 5వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఏఐ కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించారు. ఏఐ సాంకేతికతను వినియోగించుకుంటూ తరగతి గదిలో సీ గ్రేడ్ పిల్లలకు ఆంగ్లం, తెలుగు, గణితం సులభంగా నేర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఏఐ టూల్స్ వినియోగం వల్ల పిల్లల్లో వచ్చిన ఇంప్రూవ్మెంట్‌ను కలెక్టర్ పరిశీలించారు. టీచర్ స్నేహ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిరోధించడం అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న జడ్జి స్వప్నరాణి, విద్యార్థులు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిరోధించడం మనందరి బాధ్యతగా తీసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వప్న రాణి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సోమవారం అయ్యప్ప గుడి చౌరస్తాలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వప్న విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం నేరమన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆడపిల్ల వయస్సు 18 నిండక ముందే పెళ్లిచేస్తే వాటి వల్ల కలిగే అనర్థాలు, మానసిక, శారీరక, ఆర్థిక నష్టాలు వివరించారు. ఆడపిల్ల పుట్టడం, బతకడం, ఎదగడం, చదవడం నినాదాన్ని పిల్లల చేత ప్రతిజ్ఞ చేయించారు. హెల్ప్ లైన్ నంబర్ల గురించి వివరించారు. మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ సుచరిత, అకౌంటెంట్ సమత, సఖి సీఏ స్వప్న, ఐసీపీఎస్ కనకరాజు, సిబ్బంది, ముక్త్ భారత్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ శ్యామల, పోలీసులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి


సమావేశంలో పాల్గొన్న అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు

కోల్‌సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను న్యాయవాదులు విజయవంతం చేయాలని అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం అదనపు జిల్లా న్యాయ స్థానం ఆవరణలో ఈ నెల 15న నిర్వహించే లోక్ అదాలత్‌పై సన్నాహక సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గమని, ఇరువర్గాలు రాజీ కుదుర్చుకుంటే ఒకరు గెలిచినట్టు, ఒకరు ఓడినట్టు కాదన్నారు. చిట్ ఫండ్ కేసులు, మోటార్ వాహనాల బీమా కేసులు, గృహ హింస, వరకట్న వేధింపులు, వివాహసంబంధ కేసుల్లో రాజీ కుదుర్చుకునేందుకు న్యాయవాదులు ముందుకు రావాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ స్వప్నరాణి, సీనియర్ సివిల్ జడ్జి జీవన్ సూరజ్ సింగ్, మున్సిఫ్ మెజిస్ట్రేట్‌లు వెంకట సచిన్‌రెడ్డి, వెంకటేష్ దుర్వ, స్వారిక, బార్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు సతీష్, సంజయ్ కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలి

పెద్దపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చేప పిల్లలు చెరువులకు చేరేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకాటి శ్రీహరి అధికారులకు సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ఆలస్యమైందని, ఈనెల 20 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు చేప, రొయ్య పిల్లల విడుదల పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి సారించాలన్నారు. టీ-మత్స్య యాప్‌లో వివరాలను మత్స్యశాఖ అధికారి పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. ప్రతి నీటి వనరుల దగ్గర ఎన్ని చేప పిల్లలు విడుదల చేస్తున్నామో వివరాలు తెలిసేలా బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. చేపల పంపిణీ కార్యక్రమానికి ప్రోటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి నరేష్, అధికారులు పాల్గొన్నారు.

రేపు లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవం

- 10న స్వామివారి రథోత్సవం
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

పెద్దపల్లి రూరల్ , నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలో దేవునిపల్లి లక్ష్మీ నృసింహ స్వామి జాతరను యేటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రం నుండి గోదావరి ఖనికి వెళ్లే దారిలో అందుగులపల్లి నుంచి దేవునిపల్లి గ్రామం ఉంటుంది. ఈనెల 2వ తేదీ నుండి 11 వరకు స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. 5న బుధవారం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నారు. జాతరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5న స్వామివారి కల్యాణం, 10న రథోత్సవం, 11న బ్రహోత్సవాలు ముగిస్తారు. బ్రహోత్సవాలకు సుదూర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు.


శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయం, (ఇన్‌సెట్‌లో) అలంకరణలో స్వామివారి విగ్రహం

● ఆకట్టుకునేలా స్వామివారి ఆలయం

గత ఏడాది ప్రారంభించిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. దీంతో స్వామివారి ఆలయం మరింత శోభాయమానంగా దర్శనమిస్తుంది. ఆలయానికి పలువురు దాతలు అభివృద్ధి చేసేందుకు ముందుకు రాగా ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు చేపట్టడంతో ఆలయ రూపురేఖలు మారాయి. జాతరకు వచ్చే భక్తులకు మంచినీరు, విద్యుత్, పార్కింగ్, బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేసే పనిలో అధికారులు చర్యలు చేపడుతున్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- ముద్దసాని శంకర్, ఆలయ ఈవో



దేవునిపల్లి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం. జాతరకు వచ్చే భక్తులకు తాగునీరు. చలువ పందిళ్లు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశాం. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నాం.

భక్తులకు ఎంతో నమ్మకం

- కొండపాక శ్రీకాంతచార్యులు, ఆలయ అర్చకులు , దేవునిపల్లి



లక్ష్మీ నృసింహ స్వామి వారిపై భక్తులకు ఎంతో నమ్మకం. ప్రతి ఏడాది నిర్వహించే జాతరకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో పాటు, కోరిన కోర్కెలు తీర్చే స్వామి వారని ప్రసిద్ధి.

జాతరలో పార్కింగ్ ఇబ్బందులు లేకుండా చర్యలు

మండలంలోని దేవునిపల్లి లక్ష్మీ నృసింహస్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్‌లు అన్నారు. సోమవారం గ్రామంలో భక్తులు వాహనాలు పార్కింగ్ చేసేందుకు స్థలాలను పరిశీలించారు. పెద్దపల్లి నుంచి వచ్చే వారికి అందుగులపల్లి శివారులో, రంగాపూర్, మంథని నుంచి వచ్చే వారికి రాఘవపూర్ శివారు, బసంత్‌నగర్, గోదావరిఖని నుంచి వచ్చే వారికి నాగు లమ్మ గుడి సమీపంలో పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ విషయాన్ని జాతరకు వచ్చే భక్తులు గమనించాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలని సూచించారు. జాతర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రూరల్ ఎస్ఐ మల్లేష్, ట్రాఫిక్ ఎస్ఐ రాజవర్ధన్, ఆలయ ఈవో శంకర్, కాంగ్రెస్ నాయకులు బొక్కల సంతోష్, తలారి సాగర్, సుమన్‌లతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

రామగుండం కార్పొరేషన్‌లో
తాత్కాలిక ఉద్యోగుల సేవలు నిలిపివేత

- ఆగ్రోస్ సిబ్బందికి మొదటి నుంచి కష్టాలే...
- దళారులకు లక్షలు ఇచ్చి మోసపోయిన బాధితులు...
- శానిటేషన్‌లో పనులు కొన్న వారిలోనూ గుబులు...

కోల్‌సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగర పాలక సంస్థలో శానిటేషన్, ఎలక్ట్రికల్, హర్టికల్చర్ విభాగాల్లో పని చేస్తున్న తాత్కాలిక ఉద్యోగుల సేవలను సోమవారం నుంచి నిలిపివేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సంబంధించిన డాటాను ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఐఎఫ్ఎంఎస్)లో నమోదు చేయాలని, ఆధార్ లింకు చేయాలని, వారికి మాత్రమే వేతనాలు చెల్లించాలంటూ అక్టోబరు 15న ప్రభుత్వం సర్క్యూలర్ జారీ చేసింది. దీంతో కార్పొరేషన్‌లో ఆగ్రోస్ నుంచి కొనుగోలు చేసిన వాహనాలు, పార్కుల్లో, ఎలక్ట్రికల్ విభాగంలో నెలకు రూ.10500 గౌరవ వేతనంపై పని చేస్తున్న తాత్కాలిక సిబ్బంది సేవలను నిలిపివేశారు.

కార్పొరేషన్‌లో టీఎస్ ఆగ్రోస్ నుంచి కొనుగోలు చేసిన వాహనాలపై పనులు పెట్టి స్తామంటూ గత పాలకవర్గంలోని పలువురు కార్పొరేటర్లు, పారిశుధ్య విభాగంలో పని చేసిన ఉద్యోగులు అమాయకుల నుంచి లక్షలాది రూపా యలు వసూలు చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.3లక్షల నుంచి రూ.5 లక్షల వరకు దండుకున్నారు. ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సంబంధించి ఫైనాన్స్ విభాగం ద్వారా అనుమతులు ఇచ్చిన వారికే వేతనాలు చెల్లి స్తామని పేర్కొ న్నది. దీంతో పారిశుధ్య విభాగంలో 448 మంది, కార్యాల యం, ఎలక్ట్రికల్, మంచినీటి సరఫరాలో 121 మందితోపాటు సిస్టం మేనేజర్, సిస్టం అసిస్టెంట్, ఎంఐఎస్ ఆపరేటర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్‌తో పాటు కాంట్రాక్టు, ఎలక్ట్రిక్ ఇంజనీర్ సేవలను ప్రభుత్వం ఆమోదించింది. ఈ ఏడాది మేలో వీరికి సంబంధించి పేర్లతో సహా డాటాను తీసుకున్న ప్రభుత్వం వాటినే ఐఎఫ్ఎంఎస్ సైట్‌లో పెట్టింది. వారికి మాత్రమే ఆధార్ లింకు చేసి వేతనాలు చెల్లించేందుకు అవకాశం ఉంది. మిగతా వారికి వేతనాలు చెల్లించే అవకాశం లేకుండా పోయింది. దీంతో వేతనాలు చెల్లించే పరిస్థితి లేకుండా వారి సేవలను కొనసాగించడం సరికాదని భావించిన కమిషనర్ అరుణశ్రీ సోమవారం నుంచి వారి సేవలను నిలిపివేశారు. వీరితో పాటు కార్పొరేషన్‌లో పారి శుధ్య, ఎలక్ట్రికల్ విభాగంలో పనులు కొన్న మరో పది మంది డాటా కూడా ఆన్‌లైన్ కాలేదు. నిబంధనల ప్రకారం పారిశుధ్య సిబ్బంది అనారోగ్యంతో పని చేయలేని పరిస్థితి ఉంటే వారి కుటుంబ సభ్యులకు అవకాశం ఇస్తారు. కానీ కార్పొరేషన్‌లో రూ.5లక్షల నుంచి రూ.7లక్షల వరకు రేటు పెట్టి పనుల అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతున్నాయి. పనులు కొన్న వారు కార్యాలయాలు, డ్రైవర్లుగా, ఇతర పనుల్లో చేరారు. ఇప్పుడు వారీ డాటా కూడా ఐఎఫ్ఎంఎస్ సైట్‌లో నమోదు కావడం లేదు. దీంతో వారికి కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

దళారులకు లక్షలు ఇచ్చినా.. పనులు లేక అవస్థలు..

రామగుండం కార్పొరేషన్‌లో ఆగ్రోస్ వాహనాలు, ఇతర పనులకు సంబంధించి పలువురు మాజీ కార్పొరేటర్లు, దళారులకు లక్షలు ఇచ్చి పనుల్లో చేరారు. వారికి ఎప్పుడూ సరిగా వేతనాలు రాలేదు. ఎమ్మెల్యేగా రాజ్‌ఠాకూర్ ఎన్నికైన తరువాత వీరు మొర పెట్టుకోవడంతో తాత్కాలికంగా జీఓ 65ద్వారా కలెక్టర్‌కు ఉన్న వెసలుబాటుతో వీరి సేవలను వినియోగించుకుంటున్నారు. నెలకు కేవలం రూ.10,500 గౌరవ వేతనంపై పని చేస్తున్నారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ ఉండదు. కొత్తగా వచ్చిన వాహనాలను నడుపుతున్నారు. ఇప్పుడు వీరి సేవలను కూడా నిలిపివేయడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు.

రూ.7150 పలికిన పత్తి ధర



పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న

జమ్మికుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7150 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 150మందిరైతులు 1197క్వింటాళ్ల విడిపత్తి,తొమ్మిదిమంది రైతులు 12క్వింటాళ్ల గోనెసంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠధర రూ.7150, కనిష్ఠధర రూ.4800 చెల్లించి పత్తికొనుగోళ్లు చేపట్టారు. మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న -సదానందం, కార్యదర్శిమల్లేశం కొనుగోళ్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

సిగరెట్ ఇవ్వనన్నందుకు కత్తితో దాడి

కోల్‌సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మేకల మార్కెట్‌లో ముగ్గురు వ్యక్తులు తిరుపతి అనేవ్యక్తిపై కత్తితో దాడిచేశారు. డెకరేషన్ పనులుచేసే తిరుపతి, అతని స్నేహితుడు రవి పని ముగించుకుని ఇంటికి వెళుతూ మేకలమార్కెట్ సమీపంలో సిగరెట్ తాగుతుండగా అక్కడికి వచ్చిన సుందిళ్లకు చెందిన అశోక్, మేదరిబస్తీకిచెందిన అంజి, బాపూజీ నగర్‌కు చెందిన రోషన్‌లు తిరుపతి, రవిలను సిగరెట్ అడిగారు. తమ వద్ద అదనంగా సిగరెట్లు లేవని చెప్పడంతో మత్తులో ఉన్న ముగ్గురు యువకులు వారిపై కత్తితో దాడి చేయడంతో తిరుపతికి గాయాలయ్యాయి. బాధితుడు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. బాధితుడు తిరుపతి ఫిర్యాదు మేరకు అశోక్, అంజి, రోషన్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ముస్తాబాద్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్దికుంట గ్రామంలోగల దొనుకుల భూదయ్య ఇంట్లో సోమవారం షార్ట్‌సర్క్యూట్ జరిగి ఇల్లు పాక్షికంగా దగ్ధమైంది. ఇంట్లోని విలువైన భూమి కాగితాలు, బట్టలు, ఇతర వస్తువులు కాలిపోయాయి. ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

పేద విద్యార్థులకు 'కార్పొరేట్' చేయూత



● ఉన్నత విద్యను అభ్యసించేందుకు స్కాలర్‌షిప్‌లు

చొప్పదండి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు కార్పొరేట్ కంపెనీలు, మల్టీనేషనల్ కంపెనీలు చేయూతను అందిస్తున్నాయి. విద్యార్హత, కుటుంబ ఆదాయం, నేపథ్యంతో ఎలాంటి పరీక్షలు లేకుండానే ప్రైవేట్ ప్లాట్‌ఫారాల ద్వారా నేరుగా విద్యార్థుల ఖాతాలకే స్కాలర్‌షిప్ అందజేస్తాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన కంపెనీలు అందజేస్తున్న స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల కోసం...

● ప్రైవేట్ ప్లాట్‌ఫారాల ద్వారా పంపిణీ...

2025-26 విద్యాసంవత్సరానికి అనేక కార్పొరేట్, మల్టీనేషనల్ కంపెనీలు స్కాలర్‌షిప్‌లను విద్యార్థులకు అందజేసేందుకు ప్రైవేట్ ప్లాట్‌ఫారాలను ఎంచుకుంటాయి. ప్రైవేట్ ప్లాట్‌ఫారాలు విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి అర్హత, ఆన్‌లైన్ ఇంటర్వ్యూ నిర్వహించి స్కాలర్‌షిప్‌నకు ఎంపిక చేస్తాయి. నిర్దేశించిన స్కాలర్‌షిప్ మొత్తాన్ని విద్యార్థుల బ్యాంకు ఖాతాలోకి కంపెనీలు జమ చేస్తాయి. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో విద్యార్థి దరఖాస్తు చేసుకుంటే ప్రైవేట్ ప్లాట్‌ఫారాలు ఎంపిక చేస్తాయి. ఎంపికైన విద్యార్థి నాలుగేళ్ల కోర్సు మొత్తం ప్రతి ఏటా స్కాలర్‌షిప్ అందుతుంది. ఇంటర్ నుంచి డిగ్రీ కోర్సులు, ఇంజనీరింగ్, మెడిసిన్, పీహెచ్‌డి విద్యార్థులకు 10 వేల నుంచి లక్ష, లక్షా యాభై వేల రూపాయలను అందజేసే కార్పొరేట్ కంపెనీలు ఉన్నాయి.

● బడ్డీ ఫర్ స్టడీ అనే సంస్థ ప్రైవేట్ ఇండిపెండెంట్ స్కాలర్‌షిప్ ప్లాట్‌ఫారం దేశంలోనే అతి పెద్దది. ఈ సంస్థ జాతీయ స్థాయిలో అనేక కార్పొరేట్, మల్టీనేషనల్, ఎన్‌జీవో కంపెనీల స్కాలర్‌షిప్‌ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను తీసుకొని స్కాలర్‌షిప్ అందజేస్తుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎస్‌బీఐ, టాటా, హీరో, ఇండియా బుల్స్ లాంటి అనేక సంస్థలు స్కాలర్‌షిప్‌లు ఈ ప్లాట్‌ఫారం ద్వారా విద్యార్థులకు అందుతున్నాయి. స్కాలర్‌షిప్ షూర్ మీ, స్కాలర్స్ బాక్స్, ద గ్లోబల్ స్కాలర్‌షిప్ లాంటి ప్రైవేట్ ప్లాట్‌ఫారాలు విద్యార్థులకు కార్పొరేట్ కంపెనీల స్కాలర్‌షిప్‌లను అందజేస్తుంటాయి. ఈ వేదికలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించి ప్రాసెస్ చేసి కంపెనీల అనుమతి పొంది స్కాలర్‌షిప్‌లను అందజేస్తారు.

● బడ్డీ ఫర్ స్టడీ స్కాలర్‌షిప్‌లు...

- కాల్గెట్-పామోలోన్, బీడీఎస్, ఎండీఎస్ విద్యార్థులకు 75 వేల రూపాయల స్కాలర్‌షిప్ అందజేస్తుంది. చివరితేది నవంబరు 9.
- కొటాక్ కన్యా ఇంజనీరింగ్, బీడీఎస్, ఎండీఎస్, ఎల్ఎల్‌బీ విద్యార్థినులకు 1.5 లక్షల రూపాయలు అందజేస్తుంది. చివరి తేది నవంబరు 15.
- సంతూర్ అండర్ గ్రాడ్యుయేట్ చదివే విద్యార్థినులకు 24 వేల నుంచి 30 వేల రూపాయల వరకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తుంది. చివరి తేది నవంబరు 16.
- మహేంద్ర సంస్థ 9-12వ తరగతి, డిగ్రీ చదువుతున్న వారికి సంవత్సరానికి 5,300 రూపాయల స్కాలర్‌షిప్ అందజేస్తుంది. చివరితేది నవంబరు 15.
- రోల్స్‌రాయిస్ సంస్థ ఇంజనీరింగ్ చదివే విద్యార్థినులకు 35 వేల రూపాయల స్కాలర్ షిప్ అందజేస్తుంది. చివరితేది నవంబరు 30.
- ఎరిక్సిన్ సంస్థ ఇంజనీరింగ్ చదివే విద్యార్థినులకు 75 వేల రూపాయల స్కాలర్‌షిప్ అందజేస్తుంది. చివరితేది నవంబరు 30.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



కొమురయ్య(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రుక్మాపూర్‌కు చెందిన తాటికొండ కొమురయ్య(55) రాత్రి మృతిచెందినట్లు రూరల్‌సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. కొమురయ్య, అతడి భార్య నర్సవ్వ టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై కరీంనగర్ నుంచి నగునూర్‌కు వెళ్తున్నారు. ఎదురుగా చొప్పదండివైపు నుంచి వచ్చిన లారీ ఎక్స్‌ఎల్‌ను ఢీకొట్టింది. కొమురయ్య, నర్సవ్వ కింద పడడంతో గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న కొమురయ్య రాత్రి 9గంటల ప్రాంతంలో మృతిచెందినట్లు సీఐ తెలిపారు. కొమురయ్య కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో లారీ డ్రైవర్‌పై కేసునమోదు చేశామని, విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

● కుటుంబ సభ్యులపై కేసు నమోదు



సాయిసుప్రజ(ఫైల్)

ఇల్లందకుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సాయి సుప్రజ(25) సోమవారం మృతిచెందింది. ఈమేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండలోని గోపాల్‌పూర్‌కు చెందిన నిమ్మల శివశంకర్ రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి. ఇతనికి కూతురు సుప్రజ, కుమారుడు ఉన్నారు. సుప్రజను ఇల్లందకుంట మండలకేంద్రానికి చెందిన గొడిశాల విక్రమ్‌కు ఇచ్చి ఫిబ్రవరి 2, 2025లో వివాహం జరిపించారు. వివాహ సమయంలో రూ.20లక్షల నగదుతో పాటు బంగారం పెట్టారు. పెళ్లైన రెండునెలల వరకు భార్యభర్తలు మంచిగా కలిసిమెలిసి ఉన్నారు. తర్వాత సాయిసుప్రజ భర్త విక్రమ్, అత్త పుష్ప అదనంగా బంగారం తీసుకురావాలని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని సుప్రజ తల్లిదండ్రులకు తెలిపింది. శివశంకర్ అల్లుడిని, వియ్యపురాలిని అదనంగా డబ్బులు, బంగారం ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించాడు. అయినప్పటికీ వినకుండా అదనంగా బంగారం తీసుకురావాలని వేధించారు. ఈ విషయం సుప్రజ బాధపడుతూ దసరా పండుగకు వచ్చి తల్లిదండ్రులకు తెలిపి ఇంటి వద్దనే ఉంది. తల్లిదండ్రులు సుప్రజకు నచ్చజెప్పి అత్తగారి ఇంటికి పంపించారు. ఆదివారం సాయంత్రం సుప్రజ భర్త, తన బావమరిదికి ఫోన్‌చేసి మీ చెల్లెలు బాత్‌రూంలో పడిపోయిందని, జమ్మికుంట ఆస్పత్రికి తీసుకెళ్తున్నామని చెప్పాడు. తల్లిదండ్రులు వచ్చేసరికి సుప్రజ ప్రభుత్వాస్పత్రిలో చనిపోయి ఉంది. తన కూతురు మరణంలో తమకు అనుమానం ఉందని, తన కూతురు మరణానికి సుప్రజ భర్త విక్రమ్, అత్త పుష్ప కారణమని ఫిర్యాదు చేయగా, శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

కెనాల్‌లో దూకి మహిళ ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంట ఎస్‌ఆర్ఎస్‌పీ కెనాల్‌లో దూకి ఉయ్యాల అరుణ(53) ఆత్మహత్య చేసుకున్నట్లు కొత్తపల్లి సీఐ కోటేశ్వర్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. బోయినిపల్లి మండలం తడగొండకు చెందిన అరుణ ఆమె కొడుకు, ఇతర కుటుంబ సభ్యులు చింతకుంటలో కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. మూడేళ్ల కిందట అరుణకు మూర్ఛవ్యాధి వచ్చి అనారోగ్యానికి గురైంది. అప్పటినుంచి మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తోంది. సోమవారం ఉదయం కనిపించకపోవడంతో పరిసరాల్లో వెతుకుతుండగా కెనాల్‌లోని నీటిలో అరుణ మృతదేహం లభించింది. జీవితంపై విరక్తిచెంది అరుణ ఆత్మహత్య చేసుకుందని ఆమె కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు చేసినట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గోదావరి నదిలో యువకుడి గల్లంతు

● రెస్క్యూ ఆపరేషన్, లభ్యం కాని ఆచూకీ

● ఆరా తీసిన మంత్రి శ్రీధర్‌బాబు, పుట్ట మధు



సాయికృష్ణ

మంథని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గోదావరి నదిలో స్థానిక పాత బస్టాండ్ ఏరియాకు చెందిన రావికంటి సాయికృష్ణ (30)అనే యువకుడు సోమవారం ఉదయం గల్లంతయ్యాడు. ఈత కోసం వెళ్లిన సాయికృష్ణ ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో గల్లంతైనట్లు అక్కడే ఉన్న కొందరు చూసి సమాచారం ఇచ్చారు. దీంతో సాయికృష్ణ తండ్రి రావికంటి చందు నది వద్దకు వచ్చి చూడగా ఒడ్డున బ్యాగ్, షాట్, టీషర్టు, చెప్పులు, సెల్ ఫోన్ గుర్తించి ఆందోళనకు గురయ్యారు. పోలీసులకు, ఫైర్ సిబ్బంది సమాచారం ఇవ్వడంతో వారు నది వద్దకు వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలియడంతో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఫోన్‌లో చందుతో మాట్లాడి ధైర్యం చెప్పారు. గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టాలని అధికారులను ఆదేశించడంతో పోలీసు, ఫైర్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు నదిలో సాయంత్రం వరకు ఎయిర్‌బోట్‌లో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించినప్పటికి సాయికృష్ణ ఆచూకీ లభ్యం కాలేదు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సైతం గోదావరినది తీరం వద్దకు చేరుకొని రావికంటి చందును ఓదార్చి అధికారులతో ఆరా తీశారు. సాయికృష్ణ గల్లంతుతో కుటుంబంలో విషాదం నెలకొంది.

అర్ధరాత్రి మట్టి అక్రమ రవాణా

● అడ్డుకున్న గ్రామస్థులు.. ● టిప్పర్‌లు పోలీస్‌స్టేషన్‌కు తరలింపు



పోలీస్‌స్టేషన్‌లో టిప్పర్లు

గన్నేరువరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామ శివారులోని వరదకాలువ మట్టిని ఆదివారం అర్ధరాత్రి టిప్పర్ల ద్వారా ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న పోలీసులు రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గుట్టు చప్పుడు కాకుండా కొందరు వ్యక్తులు అక్రమంగా రాత్రి సమయాల్లో మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని మండిపడ్డారు.. రాత్రిళ్లు టిప్పర్ల సౌండ్‌కు నిద్రపట్టక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడంతోనే మట్టిమాఫియా యథేచ్ఛగా అక్రమరవాణా కొనసాగిస్తోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అక్రమంగా మట్టిని రవాణాచేస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి హెచ్చరించారు. పట్టుకున్న టిప్పర్లను తదుపరి చర్యలకై మైనింగ్ శాఖ ఏడీకి అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్యాయత్నం

● కూతురి పరిస్థితి చూసి తట్టుకోలేక అదేబాటలో తండ్రి

● పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితుల ఆరోపణ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉన్నత కుటుంబం.. కెనడా సంబంధం.. తన కూతురు సంతోషంగా ఉంటుందని ఆశిస్తే వివాహమైన ఆరు నెలలకే అత్తింటి వేధింపులు అధికమయ్యాయి. దీంతో మనస్థాపంచెందిన వివాహిత ఆత్మహత్యాయత్నం చేయగా కూతురు పరిస్థితి చూసి చలించిన తండ్రి పోలీసులు పట్టించుకోవడం లేదంటూ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు ఆంజనేయులు కథనం మేరకు.. గ్రామంలోని ఆంజనేయులు కూతురు నిఖితను 11నెలల కిందట కెనడాలో ఉద్యోగం చేస్తున్న పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కుచెందిన కృష్ణకాంత్‌కు ఇచ్చి వివాహం జరిపించాడు. ఆరు నెలల పాటు నిఖితను బాగా చూసుకున్న అత్తింటివారు వేధింపులకు దిగారు. పెళ్లయిన మూడునెలలకు కృష్ణకాంత్ కెనడాకు బయలుదేరాడు. ఈ క్రమంలో నిఖిత ఐదు నెలల క్రితం పుట్టింటికి చేరుకుంది. పలుమార్లు పెద్దలు పంచాయతీ నిర్వహించి కలిసి మెలసి ఉండాలని సూచించారు. అత్తింటివారిలో మార్పు రాకపోవడంతో నిఖిత తన తండ్రి ఆంజనేయులుతో కలిసి 20 రోజుల క్రితం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. న్యాయం జరుగకపోవడంతో ఆమె నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తన కూతురుకు న్యాయం చేయాలని పోలీసులకు వద్దకు వెళ్తే అత్తింటి వారికే వత్తాసు పలుకుతున్నారని నిఖిత తండ్రి ఆంజనేయులు ఈ నెల 1న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. న్యాయం చేయాల్సిన పోలీసులు అత్తింటి వారి వైపు అండగా నిలుస్తున్నారని ఆరోపించాడు. ఈ విషయంపై స్థానిక ఎస్‌ఐ రాహుల్‌రెడ్డిని వివరణ కోరగా వివాహిత నిఖిత ఫిర్యాదు మేరకు భర్త, అత్తమామలపై వరకట్నం కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. తాము ఎవరి పట్ల దురుసుగా వ్యవహరించలేమని చెప్పారు. తమపై వివాహిత నిఖిత తండ్రి ఆంజనేయులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని వివరించారు.

వలకు చిక్కిన కొండచిలువ



వలలో ఉన్న కొండచిలువ

సుల్తానాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పెద్దచెరువు మత్తడి పైనుంచి నీళ్లతోపాటు చేపలు వెళ్లిపోకుండా ఉండేందుకు కాంట్రాక్టర్ ఒకవల అడ్డుగా ఏర్పాటు చేశాడు. సోమవారం ఉదయం కట్ట మీదుగా మత్తడిపై నుంచి వెళుతున్న వారు వలలో చిక్కుకుపోయిన కొండచిలువను గమనించారు. వెంటనే సమాచారం అందుకున్న ముదిరాజులు కొండచిలువతోపాటు వలను పక్కకు లాగారు. వలలో చిక్కుకొని ఉన్న కొండచిలువపై రాళ్లతోదాడి చేయడంతో చనిపోయింది. కొండచిలువ సుమారు పది మీటర్ల పొడవు ఉందని వారు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనుమతిలేకుండా కరీంనగర్ రూరల్ మండలంలో ఇసుక తరలిస్తున్న 3ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు రూరల్‌సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బొమ్మకల్ గ్రామ శివారులోని మానేరువాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. సప్తగిరికాలనీకి చెందిన ఒకట్రాక్టర్‌ను పట్టుకున్నామని తెలిపారు. డ్రైవర్లు, యజమానులు ఆవుల కుమార్, మహ్మద్ ఇలాయాస్, అన్నమల్ల శ్రీనివాస్, మహ్మద్ ఇలాయాస్ ఖాన్, బొల్లం సంపత్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగిన వరద

జగిత్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం సోమవారం కొనసాగింది. ఎగువ ప్రాంతం నుంచి 56,513 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 16వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 47,059 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 56,513 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ఓదెల మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మృతి

ఓదెల మండలంలో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకోగా, చెరువులో పడి ఒకరు, అనారోగ్యంతో కాంగ్రెస్ నాయకుడు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే..



మహేష్, ఆవుల రాజయ్య, రవీందర్ (ఫైల్)

ఓదెల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండుగ్రామాల్లో వేర్వేరు కారణాలతో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. మడకలో పిట్టల మహేష్ (23) అనే యువకుడు ఆదివారం రాత్రి కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇల్లంతకుంట మండలం సీతంపేటకు చెందిన పిట్టల వెంకటేశం ఉపాధి కోసం పదేళ్ళ క్రితం మడకకు వచ్చారు. 12 ఎకరాలను కౌలుకు తీసుకొని జీవిస్తున్నాడు. వెంకటేశం కుమారుడు మహేష్ తండ్రికి ఆసరాగా ఉంటున్నాడు. కడుపు నొప్పి అధికం కావడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్‌ఐ ధీకొండ రమేష్ తెలిపారు.

● మడకకు చెందిన ఆవుల పెద్ద రాజయ్య (72) అనే వృద్ధుడు ప్రమాదవశాత్తు ఊరచెరువులో జారిపడి మృతిచెందాడు. ఆదివారం బహిర్భూమికి వెళ్ళిన రాజయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆదివారం వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం చెరువులో వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమారుడు కొమరయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రమేష్ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

● ఇందుర్తిలో ఆదివారం రాత్రి ఇందిరమ్మ కమిటీ సభ్యుడైన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగపూరి రవీందర్ (48) పచ్చకామెర్ల వల్ల మృతి చెందాడు. కొద్ది రోజుల నుంచి రవీందర్ పచ్చకామెర్ల వ్యాధితో పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నాడు. ఎన్ని ఆసుపత్రులు తిరిగిన కూడా నయం కాలేదు. ఇతని ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తెలంగాణలో మరో 6 నెలల పాటు కాల్పుల విరమణ

● రాష్ట్రంలో శాంతికి భంగం కలిగించేందుకు బీజేపీ కుట్ర ● మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్

మంథని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో మరో 6నెలలపాటు మావోయిస్టుపార్టీ కాల్పుల విరమణను ప్రకటించినట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం జగన్ పేరిట పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో శాంతియుత వాతావరణం కొనసాగాలని, ప్రజా సమస్యలను శాంతియుతమార్గంలో పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ఈనిర్ణయం తీసుకున్నట్లు లేఖలో వెల్లడించారు. అయితే ప్రభుత్వవైఖరిని గమనిస్తూనే.. తమ శాంతిప్రక్రియను కొనసాగిస్తామని స్పష్టంచేశారు. అన్నిరాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, సామాజికవర్గాలు శాంతియుత వాతావరణం కొనసాగాలని చేసిన ఉద్యమాలు, ప్రజలఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించిన క్రమంలో తాము గత6నెలలపాటు కాల్పుల విరమణ ప్రకటించామన్నారు. తాము శాంతియుతంగా ఉంటామని, ప్రభుత్వ వైఖరి కూడా అలానే ఉండాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో కొనసాగుతున్న శాంతియుత వాతావరణాన్ని భంగం చేయటానికి ప్రయత్నం చేస్తుందని, దీన్ని అన్ని పార్టీలు, సామాజిక వర్గాలు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలన్నారు.

కొనసాగుతున్న గోదావరి హారతి



గోదావరి నది వద్ద హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద గోదావరి హారతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరినది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి నదివద్ద విశేషపూజలు నిర్వహించారు. రాత్రి మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. ఈ కార్యక్రమంలో ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, భక్తులు పాల్గొన్నారు.

కోటిలింగాలలో..

వెల్గటూర్: వెల్గటూర్ మండలం కోటిలింగాల వద్ద గోదావరి హారతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అర్చకులు సంజీవ్ శర్మ, నాగరాజుశర్మల మంత్రోచ్చారణల మధ్య గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించారు. మహిళలు భక్తితో కార్తీకదీపాలు గోదావరి నదిలో వదిలారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పూదరి రమేష్ పాల్గొన్నారు.

వృద్ధురాలి ఇంట్లో చొరబడి బంగారం దోపిడీ

గంగాధర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒంటరి వృద్ధురాలి ఇంట్లో అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి చొరబడి బంగారం దోచుకెళ్లిన ఘటన గంగాధర మండలం కోట్లనర్సింహులపల్లిలో కలకలం రేపింది. ఎస్సై వంశీకృష్ణ వివరాల ప్రకారం.. కోట్ల నర్సింహులపల్లిలో వెముజాల సత్తమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది. ఆదివారం తనఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి అమ్మా, అమ్మా అని పిలిచాడు. లోపల నుంచి సత్తమ్మ ఎవ్వరని ఎదురు ప్రశ్నించగా ఎదుటివ్యక్తి తలుపుతీయమని అన్నాడు. ఎంతకీ పేరు చెప్పకపోవడంతో భయంతో తలుపు తీయలేదు. దీంతో ఆవ్యక్తి బలంగా తలుపును కొట్టడంతో గడిదెబ్బతిని తలుపులు తెరుచుకున్నాయి. మాస్క్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి లోపలికి వెల్లి వృద్ధురాలి మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడును కత్తిరించి ఎత్తుకెళ్లాడు. అనంతరం బయటి నుంచి గడియపెట్టి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైవంశీకృష్ణ తెలిపారు.

వన్యప్రాణిని చంపిన నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్టు చేస్తున్న అధికారులు

కొడిమ్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జింకను చంపిన కేసులో కొడిమ్యాల మండలం తిర్మాలాపూర్ గ్రామానికి చెందిన గుడికందుల ఆశయ్య అనేవ్యక్తిని సోమవారం అరెస్టుచేసినట్లు అటవీశాఖ కొడిమ్యాల రేంజర్ గులాం మొయినుద్దీన్, డిప్యూటీరేంజర్ ముషీర్ అహ్మద్ తెలిపారు. ఆశయ్య కొడిమ్యాల అటవీశివారులో వన్యప్రాణులను పట్టుకోవటానికి విద్యుత్ తీగలను ఏర్పాటుచేసుకున్నాడు. అడవిలో జింక విద్యుత్‌తీగలకు తగిలి మృతి చెందింది. గ్రామస్థులు అందించిన సమాచారం మేరకు అడవిలో గాలించి జింక కళేబరాన్ని పట్టుకొని నిందితుడిపై కేసునమోదుచేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు అటవీఅధికారులు తెలిపారు. రేంజర్ వెంట కొడిమ్యాల బీట్ అధికారి ఆనందరావు ఉన్నారు.

వృద్ధుడి అదృశ్యం.. కేసు నమోదు



నారాయణ

కోనరావుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన బద్దెపూరి నారాయణ(80) అనేవృద్ధుడు అదృశ్యమైనట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బద్దెపురి నారాయణకు మతిస్థిమితం సరిగా లేదన్నారు. గతంలో కూడా ఒకసారి ఇంట్లో నుంచి వెళ్లిపోయినప్పటికీ ఆచూకీ తెలుసుకొని కుటుంబ సభ్యులకు అప్పగించామని అన్నారు. అక్టోబర్ 31న రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని కుమారుడు రమేష్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వ్యక్తులు కోనరావుపేట పోలీస్‌స్టేషన్ కు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

వ్యక్తి అదృశ్యం పై వీడని మిస్టరీ

రామగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుధవారంపేట్‌లో కుమారస్వామి అనేవ్యక్తి అదృశ్యం మిస్టరీగా మారింది. సోమవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో ఇంట్లోనుంచి కుమారస్వామి వెళ్ళినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. తిరిగి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామానికి సమీపంలోని ఊరచెరువు సమీపంలోని వ్యవసాయ బావివద్ద కుమారస్వామికి చెందిన ద్విచక్రవాహనం, కళ్ల అద్దాలను గుర్తించారు. వ్యవసాయబావిలో గజఈత గాళ్లతో గాలింపు చేపట్టిన ఫలితం ఆచూకీలేదు. ప్రత్యామ్నయంగా బావిలోని నీటిని మోటార్ల సహాయంతో తొలగించే ప్రయత్నం చేస్తున్నారు.

కట్టు కాలువను పట్టించుకోరా..?

- భారీ వర్షం వచ్చిన ప్రతీసారి తెగుతున్న తుమ్మల చెరువు కట్టుకాలువ
- తెగిన ప్రతీసారి పంట నష్టపోతున్న రైతులు

సైదాపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్కేపల్లి శివారులో గల తుమ్మల చెరువు కట్టుకాలువ భారీ వర్షం కురిసిన ప్రతీసారి తెగిపోతుంది. దీంతో కాలువ దిగువన ఉన్న వ్యవసాయ భూముల్లోకి వరద నీరు వచ్చి పంటలు కొట్టుకుపోతున్నాయి. కట్టు కాలువ తెగకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వెన్కేపల్లి శివారులోని తుమ్మల చెరువు మత్తడి నీరు అదే గ్రామ శివారు లోని పోల్కమ్మ చెరువులోకి వెళ్లేం దుకు చాలా ఏళ్ల క్రితం ఈ కట్టు కాలువను నిర్మించారు. అప్పుడు ఈ కట్టు కాలువ చాలా వెడల్పుగా ఉండి ఎంత వర్షం పడిన ఎలాంటి అడ్డంకులు లేకుండా నీరు పోల్కమ్మ చెరువులోకి వెళ్లేది. కాలక్రమేణా కట్టుకాలువ ఆక్రమణకు గురై వెడల్పు తగ్గింది. భారీ వర్షం కురిసినప్పుడు వరద నీరు కాలువలో భారీగా చేరి కట్టుకాలువ తెగుతోంది. తుమ్మల చెరువు మత్తడి పడే కట్టు కాలువ మొదటి బాగంలో కట్టు కాలువ వెడల్పుగా ఉంది. కానీ పోను పోను కొంత దూరం నుంచి వెడల్పు తగ్గడంతో కాలువలో నీరు పొంగి కట్టపై నుంచి ప్రవహించి కట్టు కాలువ కట్ట తెగిపోతుంది. దీంతో కింది రైతులకు తీరని నష్టం వాటిల్లుతుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కట్టుకాలువ వెడెల్పు, ఎత్తు పెంచి దృఢంగా నిర్మించాలని రైతులు, మండల ప్రజలు కోరుతున్నారు.



భారీ వర్షానికి తెగిన తుమ్మల చెరువు కట్టుకాలువ కట్ట



అక్కడక్కడ కోతకు గురవుతున్న తుమ్మల చెరువు కట్టుకాలువ కట్ట

ఆరబోసిన ధాన్యంపై వానర దండయాత్ర



వడ్లను చిందరవందర చేస్తున్న కోతులు

గంభీరావుపేట, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): పంట వేసింది మొదలుకొని పైరు చేతికి వచ్చేదాక రైతన్న తిప్పలు అన్నీ ఇన్నీ కావు. పంటచేతికి వచ్చినా ధాన్యం అమ్మేదాక అష్టకష్టాలు పడాల్సిందే. అతివృష్టి, అనావృష్టితో నష్టాలను చవిచూసిన రైతన్నలు కోతుల బెడతో ఇబ్బందులు పడుతున్నారు. గంభీరావుపేట మండలంలో అన్నదాతలు ఆరబోసిన వడ్లకుప్పలను వానరాలు చిందరవందర చేస్తున్నాయి. గుంపులుగా వచ్చి తింటున్నాయి. గంభీరావుపేట నుంచి నర్మాల వెళ్లే దారిలో వడ్ల కుప్పలపై వానర గుంపు ఇలా దండుయాత్ర చేసింది.

ఉమ్మడిజిల్లా స్థాయి హాకీ ఎంపిక పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా సెక్రెటరీ వేణుగోపాల్ తదితరులు

హుజూరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో ఉమ్మడిజిల్లా స్థాయి అండర్-14,-17 బాల బాలికల హాకీ క్రీడా ఎంపికపోటీలను జిల్లా సెక్రెటరీ వేణుగోపాల్, హాకీ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షుడు తోటరాజేంద్రప్రసాద్, ఎంఈవో శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని 170మంది క్రీడాకారులు పాల్గొనగా, అందులో నుంచి అండర్-17,-14 బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేశామన్నారు. ఎంపికైన వారు వన పర్తిలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాహాకీ ఎస్‌జీఎఫ్ కన్వీనర్ వేముల రవి కుమార్, సత్యానంద్, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, అనిల్, శేఖర్, కొలిపాక శ్రీనివాస్, తాళ్లపల్లి శ్రీనివాస్, శ్యాంసుందర్, శంకర్, సజ్జు, సాయి కృష్ణ, రాకేష్, విక్రమ్, సాంబ, వంశీ, పరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన విద్యార్థి



వెయిట్ లిఫ్టింగ్ చేస్తున్న విద్యార్థి శ్రీనిత్

జమ్మికుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో నిర్వహించిన వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో జమ్మికుంట ప్రభుత్వబాలుర ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి కె సాయిశ్రీనిత్ రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడు. ఈసందర్భంగా శ్రీనిత్‌ను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు బాదం సురేష్ మాట్లాడుతూ బాలుర ఉన్నతపాఠశాలలో చదువుతున్న విద్యార్థులు విద్యతోపాటు ఆట,పాటల్లో సైతం చురుకుగా రాణి స్తున్నారని తెలిపారు. క్రీడానైపుణ్యాలు ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయన్నారు. స్పోర్ట్స్ కోటాలో కూడా విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో ద్వితీయ స్థానం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూనియర్ కళాశాలల అండర్-19 ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో నిర్వహించిన ఫైనల్స్‌లో రంగారెడ్డి జట్టు విజయవం సాధించగా ఉమ్మడిజిల్లా జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా బాలికల జట్టును అండర్-19 ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బి.వేణుగోపాల్, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి.శ్రీనివాస్‌గౌడ్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గిన్నె లక్ష్మణ్, వ్యాయామ ఉపాధ్యాయులు బి.సతీష్, ఎర్రం హరీష్, భవాని, నిరోషా, శ్రీవిద్య, లావణ్య అభినందించారు.



ఉమ్మడి జిల్లా బాలికల జట్టు

అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా కర్ర రాజశేఖర్

- వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా

కరీంనగర్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా కర్ర రాజశేఖర్ ఎన్నికయ్యారు. సోమవారం చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కోసం ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో సీహెచ్ మనోజ్‌కుమార్ ఎన్నికలు నిర్వహించారు. 12మంది డైరెక్టర్లలో కర్ర రాజశేఖర్ మాత్రమే చైర్మన్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. దీంతో కర్ర రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మనోజ్‌కుమార్ ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. వైస్‌చైర్మన్ పదవికి ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. దీంతో వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదాపడింది. వైస్ చైర్మన్ పదవిని సీనియర్ డైరెక్టర్లు బాశెట్టి కిషన్, వరాల జ్యోతి, బొమ్మరాతి సాయికృష్ణ, దేశవేదాద్రి, కన్న సాయి ఆశిస్తున్నట్లు తెలిసింది. వైస్ చైర్మన్ పదవికి పోటీ ఎక్కువగా ఉండడంతో అందరితో సమావేశమై కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చించిన అనంతరం ఏకగ్రీవం చేసేందుకు చైర్మన్ రాజశేఖర్ ఆలోచిస్తున్నట్లు సమాచారం.

హ్యాట్రిక్ చైర్మన్‌గా రికార్డు..

1996లో మొదటిసారి బ్యాంకు డైరెక్టర్‌గా ఎన్నికైన రాజశేఖర్, 2001, 2003లో వరుసగా మూడోసారి డైరెక్టర్‌గా ఎన్నికై బ్యాంకు వైస్‌చైర్మన్ పదవిని దక్కించుకున్నారు. 2007లో చైర్మన్‌గా ఎన్నికైన ఆయన 2012లో రెండోసారి చైర్మన్ బాధ్యతలను స్వీకరించి 2017వరకు ఆ పదవిలో కొనసాగారు. ఇక అప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ కోర్టు కేసుల కారణంగా బ్యాంకు పాలక వర్గ ఎన్నికలు జరుగలేదు. కోర్టు ఆదేశాలతో ఎని మిదన్నరేళ్ల తర్వాత గత శనివారం నిర్వహించిన బ్యాంకు పాలకవర్గ ఎన్నికల్లో ఇండిపెండెంట్ ప్యానల్ చైర్మన్‌గా బరిలో నిలిచి 9మంది డైరెక్టర్లను గెలిపించు కున్నారు. రాజశేఖర్‌కు మరోప్యానల్ నుంచి ఎన్నికైనఇద్దరు,ఒక ఇండిపెండెంట్ డైరెక్టర్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు దీనితో రాజశేఖర్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా మూడోసారి ఎన్నికయ్యారు. అనంతరం జగిత్యాల డీసీవో, ఎన్నికల ఇన్‌చార్జి సీహెచ్ మనోజ్‌కుమార్ సమక్షంలో కర్ర రాజశేఖర్ చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించారు.

బ్యాంకును మరింత లాభాల్లోకి తీసుకెళతాం..

చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించిన కర్ర రాజశేఖర్ మీడియాతో మాట్లాడుతూ ఐదు సార్లు డైరెక్టర్‌గా, మూడోసారి చైర్మన్‌గా తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన బ్యాంకు సభ్యులకు, డైరెక్టర్లకు, సహకరించిన నాయకులు, ఉద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. 2007నుంచి 2017 వరకు పదేళ్ల చైర్మన్‌గా బ్యాంకు అభివృద్ధికి ఎంతగానో కృషి చేశామని చెప్పారు. 25కోట్ల డిపాజిట్లను పదేళ్లలో 60 కోట్లకు తీసుకెళ్ళామని, 2017 తర్వాత బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు జరుగక పోవడంతో ఎనిమిదిన్న రేళ్లలో డిపాజిట్లు 8.5కోట్లు మాత్రమే పెరిగాయన్నారు. పాలకవర్గం ఉంటేనే ప్రజలకు సహకార బ్యాంకులపై నమ్మకం ఉంటుందన్నారు.

డిపాజిట్లను 200 కోట్లకు పెంచడంతో పాటు డిపాజిట్ నిధులను ప్రస్తుతం ఇస్తున్న మార్టిగేజ్, గోల్డ్‌లోన్‌లతోపాటు వెహికిల్ లోన్స్, క్రెడిట్ కార్డులు, ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ ఆర్‌బీఐ నిబంధనల మేరకు భద్రతతో కూడిన రుణాలను ఇస్తామన్నారు. వాటిని సక్రమంగా వసూలు చేసి బ్యాంకును మరింత లాభాల్లోకి తీసుకెళ్లేందుకు తమ పాలకవర్గం సమష్టిగా కృషి చేస్తుందని చెప్పారు. బ్యాంకులో పారదర్శకతతో నైపుణ్యత కలిగిన ఉద్యోగులను నియమించుకోవడంతోపాటు జమ్మికుంట, హుస్నాబాద్‌తో పాటు మరో మూడునాలుగు కొత్త బ్రాంచీలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్‌బీఐ నిబంధనల మేరకు బ్యాంకు అభివృద్ధికి కృషిచేస్తున్న ఉద్యోగుల వేతనాల పెంపునకు పాలకవర్గం చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు.

2007 నుంచి 17 వరకు పదేళ్ళలో తమ పాలకవర్గం పారదర్శకంగా ఖాతాదారులు, సభ్యులకు సేవలందించిందని తెలిపారు.సమావేశంలో డైరెక్టర్లు వరాల జ్యోతి, ముద్దసాని శ్వేతక్రాంతి, సరిళ్ల రతన్ ప్రసాద్, బొమ్మరాతి సాయికృష్ణ, దేశ వేదాద్రి, కన్న సాయి, బాశెట్టి కిషన్, బండి ప్రశాంత్‌దీపక్, అనరాసు కుమార్, తాడ వీరారెడ్డి, ఉయ్యాల ఆనందం పాల్గొన్నారు.



తొలి సంతకం చేసి పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్

ధర్మపురి ఆలయాన్ని..
సమగ్రంగా అభివృద్ధి చేస్తాం

- గోదావరి పుష్కరాల కోసం ఏర్పాట్లు
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



సమావేశంలో పాల్గొన్న మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కొండా సురేఖ

ధర్మపురి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ మాస్టర్ ప్లాన్‌పై హైదరాబాద్‌లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్. వివిధ శాఖల అధికారులతో కలిసి సోమవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాబోయే గోదావరి పుష్కరాల కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులు ఆగమ శాస్త్రం, వేదపండితులు, స్థానికులు, భక్తుల మనోభావాలకు అనుగుణంగా పునర్నిర్మాణ పనులు చేపట్టాలని ఆమె అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాల కోసం శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయడానికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. ధర్మపురి తీరం వెంట ఉన్న ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె ఆదేశించారు. పుష్కర స్నానాల కోసం వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా తగు సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కొండా సురేఖ తెలిపారు. మాస్టర్ ప్లాన్‌కు అవసరమైన స్థల సేకరణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రూ.50 కోట్లతో చేపట్టే నిర్మాణపనుల్లో నాణ్యత పాటించాలని ఆమె ఆదేశించారు. రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరిలక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతో గోదావరిపుష్కరాలను విజయవంతం చేస్తామని పేర్కొన్నారు. ధర్మపురి ఆలయాన్ని విస్తృతంగా అభివృద్ధి చేస్తున్న దేవాదాయ మంత్రి కొండా సురేఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాస్టర్ ప్లాన్, గోదావరి పుష్కరాల కోసం రూ.50కోట్ల ప్రతిపాదిత అభివృద్ధి పనుల గురించి ఆయన వివరించారు. సమావేశంలో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, ఎండోమెంట్ డైరెక్టర్ హరీష్, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు అధికారులు, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురికి జైలు శిక్ష

కోల్‌సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యంసేవించి వాహనాలు నడుపుతూ రెండో సారి పట్టుబడిన ఇద్దరువ్యక్తులకు సోమవారం గోదావరిఖని కోర్టు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 15మందిని సోమ వారం సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ఎదుట హాజరుపర్చగా 13మందికి రూ.27 వేల జరిమానా, ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

జగిత్యాలటౌన్: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ఒకరికి 10రోజుల జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ జ్యూడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గంప కరుణాకర్ తీర్పునిచ్చారు. గొల్లపెల్లి ఎస్ఐ సాగర్‌రెడ్డి తెలిపిన వివరాలప్రకారం వెల్గటూర్ మండలం జగదేవ్‌పేటకు చెందిన ఒల్లెపు సమ్మయ్య అతిగామద్యం సేవించి వాహనం నడిపినందుకు అతడిపై కేసు నమోదు చేయగా న్యాయమూర్తి 10 రోజుల జైలు శిక్ష విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని ఎస్ఐ సూచించారు.

భర్త మృతిని తట్టుకోలేక భార్య బలవన్మరణం



పద్మ(ఫైల్)

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భర్త మృతిని తట్టుకో లేక దేవోళ్ల పద్మ(29) అనే వివాహిత బలవన్మరణం చెందిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో సోమవారం చోటుచేసు కుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని పద్మ- హన్మంతు దంపతులు కూలీ పనులు చేస్తూ ఇద్దరు కూతుళ్ల హిందు, ప్రత్యూషను స్థానిక ప్రభుత్వ బడిలో చదివిస్తున్నారు. స్థానికంగా ఉపాధిలేక హన్మంతు యేడాదిన్నర క్రితం రూ.6లక్షల అప్పు చేసి బహ్రెయిన్ దేశానికి పయనమయ్యాడు. సెప్టెంబరు26న అక్కడ గుండెపోటుతో మృతిచెందాడు. అదేనెల30న ఆయన మృతదేహం ఇల్లు చేరింది. అంత్యక్రియలు పూర్తయిన నుంచి పద్మ దిగాలుగా ఉంటోంది. పిల్లలు స్కూల్‌కి వెళ్లిన తరవాత ఇంట్లో ఒంటరిగా ఉన్న పద్మ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. 40రోజుల వ్యవధిలో భార్యాభర్తలు మృతచెందంతో గ్రామంలో విషాదం అలుముకుంది. తల్లిదండ్రులు ఇద్దరూ మృతి చెందడంతో వీరి ఇద్దరు కూతుళ్లు అనాథలుగా మారారు. సమాచారం అందుకున్న ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రాజన్న సన్నిధిలో భక్తజన సందోహం

- కోడెమొక్కులు చెల్లించిన భక్తులు
- స్వామివారి దర్శనానికి నాలుగు గంటల సమయం



రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ



గోదావరి నదిలో కార్తీక స్నానాలు చేస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో భక్తుల రద్దీ ఏర్పడింది. రెండో కార్తీకసోమవారం సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. దేవాలయంలో విస్తరణ పనులు కొనసాగుతున్న సందర్భంగా రాజన్నఆలయంలో కేవలం లఘుదర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. భీమేశ్వరాలయంలో భక్తులు ఆర్జిత సేవలు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయంలో సాయంత్రం 6గంటల వరకు 4,680మంది దంపతులు కోడెమొక్కులు చెల్లించి ఆర్జితసేవలు నిర్వహించారు. రాజన్న సన్నిధిలో దర్శనానికి దాదాపు నాలుగు గంటలు పట్టింది.

వైభవంగా రుద్రాభిషేకం..

కార్తీక రెండోసోమవారం సందర్భంగా శ్రీ రాజరాజేశ్వరస్వామివారికి ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతలకు అర్చనలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి మహా లింగార్చన పూజను వైభంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం ఎదుట మహిళలు కార్తీక దీపాలు వెలిగించి భక్తి ప్రపత్తిని చాటారు.

కార్తీక పౌర్ణమికి ముస్తాబు

భీమేశ్వరాలయంలో ఈనెల 5న కార్తీకపౌర్ణమి సందర్భంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం సాయంత్రం 6గంటలకు భీమేశ్వరస్వామివారికి, భీమేశ్వర సదన్ పరిసర ప్రాంతంలో దీపారాధన నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

కల్యాణం టిక్కెట్ల వద్ద భక్తుల తోపులాట

రాజరాజేశ్వరస్వామి కల్యాణం టికెట్ల కోసం భక్తుల మధ్య తోపులాట ఏర్పడింది. పార్వతీపురం నిత్యాన్న సత్రం పైభాగంంలో రాజన్న నిత్యకల్యాణాన్ని నిర్వహిస్తున్నారు. ఇందుకు గతంలో 150టికెట్లు జారీచేసేది. హాలు చిన్నగా ఉండడంతో ప్రస్తుతం ఆ టికెట్ల సంఖ్య 60కి కుదించారు. కార్తీక మాసం కావడంతో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. బుకింగ్ కౌంటర్ వద్ద క్యూలో ఉన్న భక్తుల తోపులాట కారణంగా క్యూలైన్ పక్కకు ఒరిగిపోయింది. కౌంటర్‌బోర్డు విరిగి కిందపడింది. బ్లాక్‌లో టికెట్లు విక్రయిస్తున్నట్లు భక్తులు ఆందోళన చేస్తూ గొడవకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న భద్రతా సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకొని భక్తులను సముదా యించడంతో గొడవ సద్దుమనిగింది. చివరికి శాశ్వత కల్యాణాలతో కలిపి 89 టికెట్లను కేటాయించారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల పూజలు

ధర్మపురి : ధర్మపురి క్షేత్రంలో సోమవారం కార్తీక సందడి నెలకొంది. కార్తీకమాసం సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ శ్రీరామలింగేశ్వ స్వామి, శ్రీఅక్కపెల్లి రాజరాజేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోదావరినదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనెపోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఆధ్వర్యంలో అర్చకులు, సిబ్బంది తగు సేవలు అందించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

పెద్దపల్లి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ అన్నారు. పెద్దకల్వలలో చేపడుతున్న పనులను పరిశీలించారు. రోడ్ల వెంట చెత్తాచెదారం ఉండకుండా చర్యలు చేపట్టాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని కార్యదర్శులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శి నిషాంత్‌రావు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో అన్నారు. అందుగులపల్లి, దేవునిపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు. నిర్మాణాలు ప్రారంభిస్తేనే బిల్లులు సకాలంలో వస్తాయన్నారు. పంచాయతీ కార్యదర్శులు గీత, అఖిల ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కమాన్‌పూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము, మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్ యాదవ్ అన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బస్టాండ్ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి, ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమస్యలను కాంగ్రెస్ నాయకులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. తాము ప్రజల పక్షాన రాజీలేని పోరాటాలు చేస్తున్నామన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మండలాన్ని దత్తత తీసుకోవాలని, అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని అన్నారు. నాయకులు మట్ట శంకర్, మాజీ మండల అధ్యక్షుడు జంగపల్లి అజయ్, ఇరుగురాల పోచం, బీజేవైఎం మండల అధ్యక్షుడు మల్లారపు అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

కమాన్‌పూర్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ప్రియాంకను పీఆర్‌టీయూ సంఘం ఉపాధ్యాయులు సోమవారం సన్మానించారు. ప్రియాంక గ్రూప్ వన్ అధికారిగా నియామకమై ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రమేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాంపల్లి రాజ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పడాల సతీష్, మెరుగు రాజు, సూదిరెడ్డి శ్రీనివాస్, కర్రి మధుసూదన్ రెడ్డి, మండల సతీష్, సీఆర్‌పీ ప్రభాకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేయాలి

ఎలిగేడు, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీవో భాస్కర్ రావు తెలిపారు. సోమవారం నర్సాపూర్‌లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. గ్రామాభివృద్ధి కమిటీ సమావేశంలో సూచనలు చేశారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను, ఉపాధి హామీలో మంజూరైన షెడ్డు స్థలాన్ని పరిశీలించారు. కార్యదర్శి లలిత, జీపీవో, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించాలి

సుల్తానాబాద్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం సుల్తానాబాద్ అదనపు తహసీల్దార్ అన్నపురెడ్డి రాకేష్‌కు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా కన్వీనర్ ఆరెపల్లి జైకార్ బాబు, మాతంగి రేవంత్, పొన్నం చంద్రయ్య గౌడ్, న్యాతరి శ్రీనివాస్, క్యాదాసి రమేష్, సంకెనపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు బిల్లు ప్రవేశ పెట్టి 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు.

జాగృతి జిల్లా అధ్యక్షుడికి సన్మానం

సుల్తానాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కోదాటి శ్రీనివాసరావును మండల జాగృతి అధ్యక్షుడు బొంకూరి ఐలయ్య తదితరులు సన్మానించారు. సోమవారం శ్రీనివాసరావు నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. నాయకులు అబి, అజయ్, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు గోదావరి హారతి

మంథని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం మంథని గోదావరికి హారతి ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు బత్తుల సత్యనారాయణ సోమ వారం తెలిపారు. ఉత్సవం సాయంత్రం 5 గంటలకు ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని అనివార్య కారణాలతో బుధవారానికి వాయిదా వేసినట్లు తెలిపారు.

సమాధుల స్థలం ఆక్రమణపై చర్య తీసుకోవాలి

మంథని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని క్రైస్తవ సమాధుల కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని పాస్టర్ అసోసియేషన్ నాయకులు డేవిడ్, జయరాజు, అశోక్, జోషి డిమాండ్ చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. మంథని పట్టణ శివారులోని సర్వే నంబరు 314లో ప్రభుత్వం 34 గుంటల భూమిని క్రైస్తవ సమాధుల కోసం కేటాయించిందన్నారు. ఈ స్థలానికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. పాస్టర్లు నవీన్, సుదర్శన్, రాజకుమార్, జకరయ్య, ప్రభాకర్‌రాజు, డేవిడ్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల సమాచారాన్ని అందించాలి

ఎలిగేడు, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు క్రమం తప్పకుండా అందించాలని ఎంఈవో నరేంద్రచారి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం గంగ్ర దేవేందర్‌రావులు అన్నారు. సోమవారం ఎలిగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డాటా క్యాప్చరింగ్ ఫార్మేట్ తయారు చేయాలనే అంశాలపై సమావేశం ఏర్పాటు చేశారు. టీచర్ పులి వెంకటేశ్వర్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ శిరీష డీసీఎఫ్ గురించి అవగాహన కల్పించారు. సీఆర్‌పీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గోదావరిఖని చౌరస్తాలో ఉద్రిక్తత

కోల్‌సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో సోమవారం కొద్ది సేపు ఉద్రిక్తత నెలకొన్నది. రోడ్డు విస్తరణలో కట్టడాలను కూల్చివేసేందుకు ఎక్స్‌కావేటర్ వచ్చిందంటూ కొందరు అడ్డు తగిలారు. దీంతో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఘటన స్థలానికి రాగా ఇద్దరు వ్యక్తులకు సీఐకి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని తరువాత వదిలి పెట్టారు.

వీధి లైట్లను బిగించిన అధికారులు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కళ్యాణ్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంధకారంలో ఆసుపత్రి ప్రధాన రహదారి అనే కథనానికి అధికారులు స్పందించి లైట్లను ఏర్పాటు చేశారు. 20రోజులుగా జనరల్ ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారిపై విద్యుత్ దీపాలు వెలగక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన కార్పొరేషన్ ఎలక్ట్రికల్ అధికారులు కేబుల్ కట్ కావడంతో సోమవారం మరమ్మతులు నిర్వహించి లైట్లను వెలిగించారు.

ఘనంగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ

- రూ.4.66 లక్షలకు కలశం వేలం



అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపనలో వేదపండితులు, కలశం దక్కించుకున్న శ్రీనివాస్‌రెడ్డి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సోమవారం పాండవుల గుట్ట వద్ద నిర్మించిన అయ్యప్ప దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు ఎమ్మెల్యేకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అయ్యప్ప ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆయన వేడుకున్నారు. ఆలయం నిర్మించేందుకు అయ్యప్ప కమిటీ పాండవుల గుట్టపై భూమి కావాలని అడగగా కలెక్టర్‌తో మాట్లాడి ఆలయ నిర్మాణానికి రెండు ఎకరాల భూమి ఇప్పించినట్లు పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చదువు రామచంద్రరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య యాదవ్, అయ్యప్ప దీక్షపరులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప భక్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అయ్యప్ప సొసైటీ కమిటీ అధ్యక్షుడు పెద్దిరెడ్డి వీరారెడ్డితోపాటు అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో వైభవంగా సాగింది. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని పాండవుల గుట్టపై అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా కలశానికి వేలం పాట జరిగింది. వెన్నంపల్లి గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ జిన్నా శ్రీనివాసరెడ్డి కలశాన్ని రూ.4.66 లక్షలు పాట పాడి దక్కించుకున్నారు. ఇందులో పలువురు అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

యాసంగికి బేఫికర్..

(5వ పేజీ తరువాయి)

డి-83, డి-86 కాలువల కింద లక్షా 76 వేల ఎకరాల భూములున్నాయి. వచ్చే యా సంగి సీజన్‌కు మొత్తం ఆయకట్టు భూము లకు ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిన సాగు కాను న్నాయి. యాసంగి సీజన్‌లో ఎస్సారెస్పీ కింద 60 టీఎంసీల నీటిని 9 లక్షల ఎకరాల భూములకు సాగునీటిని అందించను న్నారు. వీటికి తోడు ఎల్‌ఎండీ నీటిని కూడా వాడుకో నున్నారు. జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ద్వారా హైదరాబాద్ ప్రజల తాగు నీటి అవసరాలు తీర్చడంతో పాటు మిషన్ భగీరథ పథకం ద్వారా పెద్దపల్లి, రామగుం డం, మంథని, మంచిర్యాల, ధర్మపురి నియో జకవర్గాలకు తాగు నీటిని సరఫరా చేస్తు న్నారు. అలాగే మంథని నియోజక వర్గానికి సాగునీటిని అందించేందుకు గుండారం రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయనున్నారు. రామగుండం, గూడెం ఎత్తిపోతల పథకాల తోపాటు చొప్పదండి, వేములవాడ నియో జకర్గాల్లోని పలు గ్రామాల చెరువులకు నీటిని పంపింగ్ చేసి ఆయకట్టు భూము లకు సాగు నీటిని విడుదల చేయనున్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు పడడంతో పంటలు పచ్చగా కళకళలాడుతు న్నాయి. అతివృష్టి కారణంగా పంటలు నీట మునుగుతున్నాయి. మొంథా తుఫాన్ ధాటికి జిల్లాలోని పలు గ్రామాల్లో వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. యాసంగి సీజన్‌లో మార్చి, ఏప్రిల్ మాసాల్లో వడగళ్ల బెడద తప్ప మరొకటి ఉండదని రైతులు చెబుతున్నారు. ఈ వానాకాలంలో కొంత మంది రైతుల పంటలకు నష్టం వాటిల్లగా, యాసంగి సీజన్‌లో పంటలకు ఇబ్బందులు ఉండవద్దని రైతులు ఆశిస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు అన్నారు. తెలుకుంట, పెద్దాపూర్ గ్రామాల్లో సోమ వారం సహకార సంఘం, ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ధా న్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ముందుకు తీసుకపో యేందుకు అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. విండో చైర్మన్‌లు విజయభాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్ రావు, పార్టీ మండల అధ్యక్షుడు బొజ్జ శ్రీని వాస్, మధూకర్, బొట్ల వెంకటేశ్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): గింజ కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేయిస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు రైతులకు తెలిపారు. కాల్వశ్రీరాంపూర్, కూనారం గ్రామాల్లో సింగిల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మండలంలోని 51 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, సింగిల్ విండో చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, తహసీల్దార్ జగదీశ్వర్ రావు, ఏడీఏ శ్రీనాథ్, ఏఓ నాగార్జున, పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో పలువురు దరఖాస్తులు సమర్పించారు. పాలకుర్తి, సుల్తానాబాద్ మండలాలల్లోని పలు గ్రామాల నుంచి బాధితులు ప్రజావాణిలో తమ గోడు వెల్లబోసుకున్నారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన శంకరయ్య హనుమాన్ దేవాలయం వద్ద రెండు బెల్టుషాపులు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది చేస్తున్నారని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయగా, ఎక్సైజ్ శాఖకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

పెద్దపల్లి కల్చరల్,నవంబరు3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి వాణిశ్రీ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర చిల్డ్రన్ ఆసుపత్రిని తనిఖీచేశారు. ఆసుపత్రిని రెన్యువల్ చేసుకున్న సందర్భంగా ఆమె తనిఖీ చేసి పలు అంశాలను సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ గడువు ముగిసే మూడు నెలల ముందుగానే ఆసుపత్రులు రెన్యువల్ చేసుకోవాలన్నారు. లేని పక్షంలో జరిమానాలు విధిస్తామని తెలిపారు. డిప్యూటీ మాస్ మీడియా అధికారి శివంగారి వెంకటరత్నం, ఎంపీహెచ్ ఈఓ రాజేశం పాల్గొన్నారు.

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు

ఓదెల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మీసేవ కేంద్రాల్లో అధిక చార్జీలు వసూలు చేస్తే నిర్వాహకులపై చర్యలు తప్పవని తహసీల్దార్ ధీరజ్ కుమార్ అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో సోమవారం మీసేవ కేంద్రాల నిర్వాహ కులతో సమావేశాన్ని నిర్వహించారు. కేంద్రాలకు వచ్చే వినియోగదారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని, కేంద్రంలో చార్జీల పట్టికలను ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తానని తెలిపారు.

ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాలి

మంథని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలలో ఉత్తమ ఫలితాల సాధనకు అధ్యాపకులు, విద్యార్థులు సమిష్టిగా కృషి చేయాలని నోడల్ అధికారి కల్పన సూచించారు. ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. త్వరగా సిలబస్ పూర్తి చేసి రివిజన్‌కు ఎక్కువ సమయం కేటాయించాలన్నారు. వార్షిక పరీక్షల టైం టేబుల్ విడు దల కావడంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. కళాశా లకు హాజరు కాకపోతే ఫీజు చెల్లింపులో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ సయ్యద్ సలీం, అధ్యాపకులు ఉన్నారు.

మాజీ మంత్రి హరీష్‌రావుకు పరామర్శ

జూలపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు తండ్రి ఇటీవల మృతి చెందారు. మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాటకుల అనిల్ సోమవారం హరీష్‌రావును కలిసి పరామర్శించారు.

విద్యార్థులకు కనీస విద్యాప్రమాణాలు అందించాలి

పెద్దపల్లి కల్చరల్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 90 శాతం విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సుల్తానాబాద్, ముత్తారం, జూలపల్లి, ధర్మారం, ఎలిగేడు, కమాన్‌పూర్ మండలాలకు చెందిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెడ్‌మాస్టర్లతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు రోజు అరగంట తెలుగు, ఇంగ్లీష్ స్కిల్స్ పెంపుపై దృష్టి సారించాలన్నారు. పిల్లలకు చదవడం అలవాటు అయ్యేలా ప్రోత్సహించాలన్నారు. లెక్కలకు సంబంధించి మల్టిప్లికేషన్, డివిజన్ రావడం లేదని, ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. రెగ్యులర్‌గా సమావేశాలు నిర్వహిస్తూ పురోగతిపై రివ్యూ చేసుకో వాలన్నారు.

పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్ ఇవ్వాలి

జిల్లాలోని ప్రతీ ప్రభుత్వ విద్యాసంస్థకు అవసరం మేరకు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా నూతన గ్యాస్ కనెక్షన్‌లు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. దీనిని పేదలందరు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

ఈ పథకం కింద రూ.300ల సబ్సిడీ బ్యాంకు ఖాతాల్లో వినియోగదారులకు ప్రతి సిలిండర్ కొనుగోలుపై జమ చేస్తారన్నారు. నూతనం గా 23 వేల రేషన్‌కార్డులు జారీ చేశామని, వాటిలో ఎవరికైనా గ్యాస్ కనెక్షన్ లేనిపక్షంలో అందించేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. విద్యాసంస్థలకు గ్యాస్ కనెక్షన్ సరఫరాకు అవసరమైన నిధులను కలెక్టరేట్ నుంచి చెల్లిస్తామని ఆయన తెలిపారు. ఈనెల 25 నాటికి జిల్లాలో కట్టె పొయ్యి లేకుండా చూడాలన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాష్, అధికారులు పాల్గొన్నారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జిల్లాలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఖాళీ సీట్లకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తుల చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సీట్ల కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

మహిళా వరల్డ్ కప్ విజయంపై బీజేపీ సంబరాలు



కోల్‌సిటీటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మహిళా క్రికెట్ వరల్డ్ కప్‌ను భారత్ గెలుపొందడంపై సోమవారం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి కందుల సంధ్యారాణి విద్యార్థినిలతో కలసి సంబురాలు జరుపుకున్నారు. విద్యార్థినిలకు స్వీట్లు పంచారు. సంధ్యారాణి మాట్లాడుతూ మహిళా వరల్డ్ కప్‌లో టీం ఇండియా జట్టు ప్రదర్శన దేశానికి గర్వకారణమని, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో జట్టు సభ్యులు దేశ ప్రజల మనస్సులను గెలుచుకున్నారన్నారు. మండల అధ్యక్షురాలు అపర్ణ, పద్మ, బాలకిషన్, కళ్యాణ్, ఉమర్, సురేష్ పాల్గొన్నారు.

కళాశాలల బంద్‌కు ఏఐఎస్ఎఫ్ మద్దతు

కోల్‌సిటీటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఫీజ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిల విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ ప్రైవేట్ డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు తలపెట్టిన నిరవధిక బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం తెలిపారు. సోమవారం ఖనిలో జరిగిన నిరసనలో మాట్లాడారు. బకాయిలను విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతుండడంతో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. విద్యార్థుల భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వం చలగాటం ఆడుతున్నదని, వెంటనే కాలేజీ యాజమాన్యాలతో చర్చించి బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జశ్వంత్, అభిలాష్, ప్రైవేట్ కాలేజీల ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

ఠాణాకు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలి

అంతర్గాం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ప్రజలతో పోలీసులు మర్యాదగా ప్రవర్తించాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అన్నారు. సోమవారం అంతర్గాం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పరిసరాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. శాంతి భద్రత పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసుల వివరాలను ఎస్ఐ బోయ వెంకటస్వామిని తెలుసుకున్నారు. సీఐ ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

ఇరుపార్టీల మధ్య శిలాఫలకం వివాదం

ధర్మారం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నంది మేడారంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణ శిలాఫలకం ఏర్పాటు కోసం కాంగ్రెస్ నాయకులు శనివారం రాత్రి గద్దెను కట్టారు. కాంగ్రెస్ నాయకులు కట్టిన గోడ బీఆర్ఎస్ జెండా పక్కనే ఉందని, ఉద్దేశ్య పూర్వకంగానే జెండా పక్కన ఏర్పాటు చేశారని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇది కాస్త ఇరు పార్టీల మధ్య వాగ్వాదానికి తెరలేపింది. బీఆర్ఎస్ జెండా గద్దె పక్కన కావాలనే నిర్మించారని బీఆర్ఎస్ నాయకులు, భవన నిర్మాణం పూర్తయ్యాక శిలాఫలకం తొలగిస్తామని కాంగ్రెస్ నాయకులు వాదిస్తున్నారు. పోలీసులు జోక్యం చేసుకొని సమస్యను అధికారుల వద్ద పరిష్కరించాలని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. పోలీసుల సూచనల మేరకు బీఆర్ఎస్ నాయకులు గద్దెను తొలగించేలా చర్యలు తీసుకోవాలంటూ సోమవారం ఎంపీడీఓ ఐనాల ప్రవీణ్ కుమార్‌తో పాటు ఎస్ఐకి ఫిర్యాదుచేశారు. తాము మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి వ్యతిరేకం కాదని గద్దె నిర్మాణానికి మాత్రమే వ్యతిరేకమని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.



పెన్షనర్ల కోసం లైఫ్ సర్టిఫికెట్ క్యాంపు



క్యాంపులో మాట్లాడుతున్న జీఎం లలిత్ కుమార్

గోదావరిఖని, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పదవీవిరమణ కార్మికుల కోసం సోమవారం ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంప్ ప్రారంభించారు. సీఎంపీఎఫ్ కమిషనర్ పచౌరి, అసిస్టెంట్ కమిషనర్ గోవర్ధన్, ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ హాజరై వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్‌ని ప్రతి సంవత్సరం సమర్పించాలని, దీనిని సులభతరం చేయాలని ఉద్దేశంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సీఎంపీఎఫ్ సంస్థ, ఆర్‌జీ-1 ఏరియా సంయుక్తంగా పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంప్ నిర్వహించారు. క్యాంపు రెండు రోజుల పాటు ఉంటుందని, ఓమాంగ్ అనే మొబైల్ యాప్ ద్వారా నమోదు అవ కాశం ఉందని తెలిపారు. ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, ఎస్ఓటూ జీఎం చంద్రశేఖర్, పర్సనల్ అధికారులు శివ నారాయణ, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, వేణు, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్జీ-2 పరిధిలో 6,7 తేదీల్లో

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): సీఎంపీఎఫ్ డిజిటల్ లైఫ్ సర్టిఫికేషన్ క్యాంపెయిన్ ఈనెల 6,7 తేదీల్లో ఆర్జీ-2లో నిర్వహించనున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి అరవిందరావు ప్రకటనలో పేర్కొన్నారు. జీఎం కార్యాలయంలోని కమ్యూనికేషన్ సెల్‌లో సీఎంపీఎఫ్ సిబ్బంది అందుబాటులో ఉండనున్నారని, పెన్షనర్లు తమ డిజిటల్ సర్టిఫికెట్లను చేయించుకోడానికి వారి పీపీఓ, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, మొబైల్ ఫోన్లతో సీఎంపీఎఫ్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ఓసీపీ-3లో రక్షణను విస్మరించిన యాజమాన్యం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ప్రాజెక్టులో కార్మికుల రక్షణను యాజమాన్యం పూర్తిగా విస్మరించినట్టు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రాజారెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. గత నెలలో ఓసీపీ-3లో నాలుగు ప్రమాదాలు జరిగి కార్మికులు గాయాలపాలైనట్లు తెలిపారు. ప్రమాదాల విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. మూడేళ్ళుగా ప్రాజెక్టు అవసరాలకు సరిపడా డోజర్లు, గ్రేడర్లు లేకపోవడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని, అవసమైన యంత్రాలను సమకూర్చాలని యాజమాన్యాన్ని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయని, రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకెళ్తే కార్మికులపై కక్షపూరితంగా అధికారులు వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓసీపీ-3లో రక్షణ చర్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

రీజియన్ హాకీ పోటీల్లో ఆర్జీ-1 గెలుపు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వర్క్‌పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆర్జీ-2 ఆధ్వర్యంలో సోమవారం అబ్దుల్ కలాం స్టేడియంలో రామగుండం రీజియన్ స్థాయి హాకీ పోటీలు జరిగాయి. పోటీల్లో రామగుండం ఏరియా-1,-2 జట్లు తలపడ్డాయి. ఆర్జీ-2 జట్టుపై ఆర్జీ-1 జట్టు 3-2 గోల్స్ తో విజేతగా నిలిచింది. పోటీల్లో రెండు జట్లతో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసి కంపెనీ స్థాయి పోటీలకు పంపనున్నారు. ఆర్జీ-1,2 స్పోర్ట్స్ సూపర్ వైజర్లు రమేష్, నరేందర్‌రెడ్డి, కోఆర్డినేటర్లు సత్యనారాయణ, కిషోర్‌లు పోటీలను నిర్వహించారు.

రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా, బోనస్ చెల్లించాలి

గోదావరిఖని, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో రిటైర్డ్ అయిన కార్మికులకు ఇప్పటివరకు రావాల్సిన లాభాల వాటా, బోనస్ చెల్లించడంలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుందని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం జీఎల్‌బీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ కృష్ణ అన్నారు. సోమవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రిటైర్డ్ కార్మికులు తమకు రావలసిన వాటా, బోనస్‌ల గురించి ఎదురుచూస్తున్నారని, యూనియన్లు కూడా ఎవరు మాట్లాడటం లేదని, ఇప్పటికైనా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు సింగరేణి యాజమాన్యంతో చర్చించి ఇప్పించాలన్నారు. నాయకులు ఈ నరేష్, ఐ రాజేశం, ఎం కొమరయ్య, ఎస్ ప్రసాద్, ఎడ్ల రవికుమార్, తిరుపతి పాల్గొన్నారు.

జాతీయ పరిశోధన సంస్థతో సింగరేణి ఒప్పందం



జేఎన్ఏఆర్‌డీడీసీ అధికారులతో సింగరేణి సీఎండీ బలరాం

గోదావరిఖని, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా పలు పరిశోధనా సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంటుంది. నాగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న కేంద్ర గనుల శాఖ అనుబంధ స్వతంత్ర పరిశోధన సంస్థ జవహర్‌లాల్ నెహ్రూ అల్యూమినియం రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ డిజైన్ సెంటర్(జేఎన్ఏఆర్‌డీడీసీ)తో కీలక ఖనిజాలు, రేర్‌ఎర్త్ ఎలిమెంట్స్ ఉనికి, విస్తరణ తదితర అంశాలను అందించడానికి ఒప్పందం కుదిరింది. సోమవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సీఎండీ బలరామ్ సమక్షంలో డైరెక్టర్(పీపీ) కే వెంకటేశ్వర్లు, పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ అనుపమ్ అగ్నిహోత్రి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. సింగరేణి సంస్థ పెద్ద ఎత్తున దేశ, విదేశాల్లో వ్యాపార విస్తరణ చర్యలు చేపట్టాలని నిర్ణయించిందని, వీటిలో కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌పైన ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ అనుపమ్ అగ్నిహోత్రి మాట్లాడుతూ సింగరేణితో ఒప్పందం కుదరటం ఆనందంగా ఉందన్నారు. డైరెక్టర్లు ఎల్‌వీ సూర్యనారాయణ, కే వెంకటేశ్వర్లు, తిరుమలరావు, జీఎం(కో ఆర్డినేషన్) టీ శ్రీనివాస్, జీఎంలు రాందాస్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

రామగిరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆదివారంపేట్ గ్రామానికి చెందిన లద్నాపూర్ శివారులోని పంట పొలాల్లో ఓసిపి-2 బ్యాక్ వాటర్‌తో పొలాలు నీట మునుగుతున్నాయని, పొలాలను కాపాడాలని తహసీల్దార్ సుమన్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఆదివారంపేట్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు మైదం వరప్రసాద్, నాయకులు ఎలువాక కొమురయ్య, సంజీవ్, ఓదెలు, కుమార్, చంద్రయ్య, రాజ్‌కుమార్ అందజేశారు.